క్లుప్తంగా

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ ఆలయ ఈవో భ్రమరాంబ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సూపరిండెంటెంట్ కె.హరికృష్ణకు ఆడిట్ అండ్ జనరల్ విధులు కేటాయించగా, జూనియర్ అసిస్టెంట్ బి.సూరిబాబుకు క్యాషియర్ నుంచి దర్శన టికెట్ల విక్రయ కౌంటర్‌కు, జె.దండేశ్వరరావుకు నైట్ క్యాషియర్ నుంచి దర్శన టికెట్ల విక్రయ కౌంటర్‌కు, ఎం.విజయకుమారికి దర్శన టికెట్ల విక్రయ కౌంటర్ నుంచి క్యాషియర్ విధులకు బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ ఎన్వీ.దుర్గారావుకు దర్శన టికెట్ల కౌంటర్ నుంచి నైట్ క్యాషియర్ విధులు కేటాయించారు. క్లీనర్ బి.వెంకటరావుకు ప్రసాదం టికెట్ల కౌంటర్ నుంచి ఆడిట్ ఆఫీస్‌కు, ఎన్ఎంఆర్ కర్రి రమేష్‌కు ఆడిట్ ఆఫీసు నుంచి ప్రసాదం టికెట్ల కౌంటర్‌కు బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ ఎస్.గంగాధర్‌రావుకు స్కానింగ్ పాయింట్ నుంచి ట్రస్ట్ బోర్డుకు, అటెండర్ పి.సాయి గోపాల్‌కు రికార్డు రూమ్ నుంచి స్కానింగ్ పాయింట్‌కు బదిలీ చేశారు.

సేవాభావంతో అన్నప్రసాదం అందించండి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసే భక్తుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. మహా మండపం రెండో అంతస్తులో జరుగుతున్న నిత్యాన్నదానాన్ని దుర్గగుడి చైర్మన్ రాంబాబు సోమవారం పరిశీలించారు. అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో ఆయన మాట్లాడారు. అదే విధంగా ఆహార పదార్థాలు నిల్వ చేసుకునే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సిబ్బంది తప్పనిసరిగా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అంగన్‌వాడీల గంటల ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన బాట పట్టారు. కోర్కెల దినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు 36 గంటల ధర్నా చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో కంటే అదనంగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మరో 11 డిమాండ్లను పరిష్కారం చేయాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీలు తెలిపారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, వివిధ పార్టీల, సంఘాల నాయకులు సీహెచ్ బాబురావు, డి.వి.కృష్ణ, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కె.ధనలక్ష్మి, డి.రమాదేవి, మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ నెల 12న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపాలని కోరారు.

వస్త్ర దుకాణం వద్ద నిరసన

పటమట(విజయవాడతూర్పు): బీసీలపై దాడులను నిరోధించడానికి వీలుగా ఎస్సీ, ఎస్టీ చట్టం మాదిరిగా బీసీల పరిరక్షణ చట్టం తీసుకురావాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు కోరారు. ఇటీవల ధర్మవరం చేనేత చేనేత వ్యాపారులపై ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్ గుప్తా దాడిని నిరసిస్తూ ఆలయ సిల్క్స్ షోరూమ్ వద్ద కేశన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్ గుప్తా హైదరాబాద్‌లో గతంలో ఇటువంటి అక్రమాలకు పాల్పడినందుకు అక్కడ ఆయనపై కేసులు ఉన్నాయన్నారు. ఆయన ఆస్తులు జప్తు చేసి చేనేత వ్యాపారస్తులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలపై దాడులు చేస్తే పోరాటం చేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పి.మహేష్, పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షుడు దార్న చంద్రశేఖరరావు, అవ్వారు బుల్లాబ్బాయి, నాయకులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై మొదటి భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రిటైర్‌మెంట్ తర్వాత రెండో వివాహం చేసుకుని మొదటి భార్యను పట్టించుకోకుండా వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలప్రాజెక్టు సమీపంలోని గంగానమ్మ గుడి వద్ద దూదేకుల కాశింబీ, హుస్సేన్ దంపతులు నివాసం ఉంటున్నారు. హుస్సేన్ సీఆర్పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. 10 నెలల కిందట హుస్సేన్ మండే నాగలక్ష్మి అలియాస్ నసీమాను పెళ్లి చేసుకున్నాడు. గతేడాది ఆగస్టులో ఈ విషయం తెలుసుకున్న కాశింబీ భర్తను నిలదీసింది. అప్పటి నుంచి మొదటి భార్యపై హుస్సేన్ వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వలంటీర్ వ్యవస్థపై పవన్ వ్యాఖ్యలు హేయం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



రెల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వించిపేట(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు హేయమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 49వ డివిజన్ టైలర్‌పేటలో రెల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. సీఎం అభివృద్ధి నిధుల నుంచి రూ.25 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, వాటర్ పైపులైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు నేరుగా అందిస్తున్న వలంటీర్లను చులకన చేస్తూ పవన్ కళ్యాణ్ మాట్లాడటం ఆయన లోక జ్ఞానాన్ని తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, శీరంశెట్టి పూర్ణ చంద్రరావు, రెల్లి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నా రాజు, మీసాల సాంబశివరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దుర్మార్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తమపై చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని వలంటీర్లు ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. పవన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పాతబస్తీలోని 37వ డివిజన్‌లోని గాంధీ పార్క్ సమీపంలోని 184, 275 సచివాలయం వలంటీర్లు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయం ఎదుట వలంటీర్లు పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటీర్ వ్యవస్థను దూషించిన పవన్ కళ్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సేవా దృక్పథంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే చేరవేస్తున్న వలంటీర్లను పవన్ అవమానించడం హేయమన్నారు.

పవన్ క్షమాపణ చెప్పాలి..

వలంటీర్ వ్యవస్థపై అవమానకర తీరులో మాట్లాడిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు డిమాండ్ చేశారు.



బీఆర్పీ రోడ్డులోని సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు



పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్పొరేటర్ చైతన్యరెడ్డి

వలంటీర్ వ్యవస్థను, యువతీ యువకులను అసాంఘిక శక్తులుగా చిత్రీకరించడానికి ప్రయత్నించడం సరికాదని ఆయన దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ నిఘా నివేదికలు కూడా బహిర్గతం చేయాల్సిన బాధ్యత జనసేన పార్టీదేనని ఆయన పేర్కొన్నారు.

పవన్ కడుపు మంటతోనే నీచ వ్యాఖ్యలు

పవన్‌కల్యాణ్ కడుపు మంటతోనే వలంటీర్లపై నీచ వ్యాఖ్యలు చేస్తున్నారని ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజీద్‌ఖాన్ పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉన్న గ్రామ వాలంటీర్లపై నీచ వ్యాఖ్యలు చేయటం దుర్మార్గమని తెలిపారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని పార్టీకి కేంద్ర నిఘా వర్గాలు చెప్పాయంటూ మాట్లాడటం ఆయన తప్పుడు తీరును తెలుపుతుందని పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వలంటీర్లపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా భవానీపురం పరిధిలోని 41, 42 డివిజన్లకు చెందిన వలంటీర్లు ఆందోళన చేపట్టారు. భవానీపురం స్వాతి రోడ్డులో కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి వలంటీర్లతో కలిసి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లను ఉద్దేశించి పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ల సేవలు పవన్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. వలంటీర్లు అంటే గోనె సంచులు మోసుకునే వారు కాదని, ప్రజా శ్రేయస్సు కోరేవారన్నారు. ఇంటర్ తప్పిన పవన్‌కు వలంటీర్ల విలువ తెలియదని ఎద్దేవా చేశారు.

41వ డివిజన్‌లో..

41వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ వలంటీర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- స్పందనకు 23 అర్జీలు
- వీఎంసీ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో వారు పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 20 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగం–8, ఇంజినీరింగ్ విభాగం–6, రెవెన్యూ–3, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ), ఎస్టేట్, పబ్లిక్ హెల్త్ విభాగానికి సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందిందన్నారు. ఆయా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతి రోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు.

రికార్డుల తనిఖీ తప్పనిసరి..

జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించేందుకు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల కార్యదర్శులను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరిచేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. విభాగాల ఉన్నతాధికారులు వారంలో తమకు కేటాయించిన సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని, నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ ఓ.శ్రీనివాస్, బయోలజిస్ట్ డి.సూర్య కుమార్, మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమాల్లో సర్కిల్ –1, 3ల్లో పట్టణ ప్రణాళిక విభాగం నుంచి మూడు అర్జీలు అందాయి. అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్లు చెప్పారు.

సీఎం వైఎస్ జగన్ వెంటే మైనార్టీలు



గొల్లపూడి మసీదు వద్ద ముస్లింలతో గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైనార్టీల ప్రయోజనాలను కాపాడుతూ వారి పక్షాన ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ముస్లిం మైనార్టీలందరూ ఉండాలని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం 'హర్ దిల్ మే వైఎస్సార్‌'లో భాగంగా సోమవారం సాయంత్రం గొల్లపూడి మసీదు వీధిలో గల సిద్ధికియా మసీదు వద్ద ఆయన స్థానిక ముస్లిం పెద్దలు, మసీదు బాధ్యులతో సమావేశం నిర్వహించారు. తొలుత వారితో కలిసి అసర్ నమాజ్ ఆచరించిన అనంతరం మసీదు ఆవరణలో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ.. జగనన్నకు ముస్లిం మైనార్టీలందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు మద్దతుగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ కరపత్రాలను అందజేశారు. షేక్ బాజీ షహీద్, ఎండీ ఇక్బాల్, షేక్ నాగుల్‌మీరా, మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ బాషా, సెక్రటరీ ఎండీ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ షేక్ అప్సర్, జాయింట్ సెక్రటరీ సయ్యద్ మన్సూర్ అలీ పాల్గొన్నారు.

కేతనకొండలో..

ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలోని అల్లాహు అక్బర్ మసీదులో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ మొహమూద్ సోమవారం 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కె సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ముస్లిం మైనార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మొహమూద్ మాట్లాడుతూ.. సీఎం జగన్ జనరంజక పాలన ద్వారా మైనార్టీల బాంధవుడిగా నిలిచారని పేర్కొన్నారు. నాయకులు ఎస్ఎం అలీ, మసీదు ప్రెసిడెంట్ సయ్యద్ జానీ, వైస్ ప్రెసిడెంట్ పఠాన్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ, తెలంగాణ రీజనల్ గేమ్స్ షటిల్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని అజిత్‌సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆషా జార్జి తెలిపారు. పాఠశాలకు చెందిన డి.శతమన్యు, ఆర్.కార్తీక్ కుమార్ అండర్ – 17 విభాగంలో డబుల్స్‌లో ప్రథమ స్థానం, సింగిల్స్ విభాగంలో శతమన్యు ప్రథమ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ సరోజిని, వ్యాయామ ఉపాధ్యాయులు బి.జోసఫ్, ఈ.డేవిడ్ రాయ్ పాల్గొన్నారు.

చేనేత వృత్తిదారులపై దాడి శోచనీయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చేనేత కార్మికుల నుంచి చీరలను కొనుగోలు చేసిన వ్యాపారులు వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ.రావు డిమాండ్ చేశారు. కేఎల్‌రావు నగర్‌లోని ఋత్విక్ డిగ్రీ కాలేజీ ఆవరణలోని బీసీ ఇంటర్నేషనల్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎన్వీ.రావు మాట్లాడుతూ.. ధర్మవరం వ్యాపారులపై విజయవాడ, గుంటూరుకు చెందిన వ్యాపారులు దాడికి పాల్పడటం శోచనీయమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో పాటు షోరూం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాపారాలు లేక చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం చూస్తున్నామని, అటువంటి తరుణంలో వ్యాపారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్, సంయుక్త కార్యదర్శి పట్నాయక్, కార్యవర్గ సభ్యుడు వెంకట్రావు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బాయన బాబూజీ మాట్లాడుతూ.. తమ క్లబ్ తరుపున చేస్తున్న సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పేద బ్రాహ్మణ కుటుంబాలకు సరుకులు అందజేశామన్నారు.

గృహాల రిజిస్ట్రేషన్లలో ఆటంకం లేకుండా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): జేఎస్ఎస్‌యూఆర్ఎం పథకం కింద కేటాయించిన గృహాల రిజిస్ట్రేషన్లలో ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కొత్త బిల్డింగ్ నందు గృహాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 7,210 ఇళ్లను ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరిష్కరించాలని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి చెల్లించవలసిన ఫీజుల వసూళ్ల కౌంటర్, డాక్యుమెంట్ కౌంటర్, ఈకేవైసీ కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.వి.జి.ఎ స్.వి ప్రసాద్, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, మేనేజర్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ విజేతకు అభినందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): నెల్లూరులో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింట్ చెస్ టోర్నమెంట్‌లో అజిత్‌సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీ విద్యార్థి బత్తుల భానుప్రకాష్ అండర్ –16 విభాగంలో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా అకాడమీలో భానుప్రకాష్‌కు సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. అకాడమీ డైరెక్టర్ కోచ్ అవ్వారు రామకృష్ణ భానుప్రకాష్‌ను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుప్రకాష్ తన ర్యాపిడ్ రేటింగ్‌ను 68 పాయింట్లు సాధించటం ద్వారా తన రేటింగ్‌ను 1084కు మెరుగు పరుచుకున్నారన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగనన్న రాష్ట్రంలో ఇంటి ముంగిటకే పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇళ్ల వద్దకే అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ఊర్మిళానగర్ 43వ డివిజన్‌లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అర్హులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పవన్ క్షమాపణ చెప్పాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. పనులు మానుకుని ధ్రువీకరణ పత్రాల కోసం తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ఆ పరిస్థితి పూర్తిగా తొలగిపోయిందన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏయే ధ్రువీకరణ పత్రాలు కావాలి? ఏయే పథకాల లబ్ధి అందడం లేదో తెలుసుకుని అర్హత ఉన్న వారికి అందజేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు లబ్ధి పొందని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చేందుకు జగనన్న సురక్ష దోహదం చేస్తోందన్నారు. అవగాహన లేని చంద్రబాబు, దత్తపుత్రుడు విమర్శలు చేస్తున్నారన్నారు.

ప్రభుత్వంపై ఆరోపణలు మాని గత పాలనకు, ఈ పాలనకు తేడా చూడాలన్నారు. జగనన్న నిలబెట్టిన అభ్యర్థులపై ఓడిపోయిన పవన్ కళ్యాణ్ ఏక వచనంతో మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేసిన పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని కుల ధ్రువీకరణ పత్రాలు 798, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 644, ఈడబ్ల్యూఎస్ 3, రైస్ కార్డు 6, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 4 జారీ చేశారు. 95 మందికి ఆధార్ అప్‌డేషన్ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నగరపాలకసంస్థ, రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి సన్మానం



లక్కీడిప్ తీస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డీఎంహెచ్‌వో సుహాసిని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూలై 11 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ నియంత్రణ కార్యక్రమ అమలులో వివిధ హోదాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సన్మాన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసినితో కలిసి లక్కీడిప్ తీశారు. వివిధ పద్ధతుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. లక్కీడిప్‌లో ఎంపికైన వారు ఏయే ఆస్పత్రుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్నారో ఆయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందిని సత్కరిస్తామన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కౌన్సిలర్లకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జె.ఉషారాణి, ఎస్.లక్ష్మోజి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు



అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: సాయంత్రం వేళకు ఇంటికి చేరుకుంటామని ఫోన్ చెప్పిన తమ కుటుంబ సభ్యులు గంటల వ్యవధిలో విగత జీవులవుతారని కలలో కూడా ఊహించలేదని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద కన్నీరుమున్నీరయ్యారు. గుండెలవిసేలా రోదించారు. వారి రోదనలు పలువురికీ కంటతడి పెట్టించింది. ఆదివారం మిట్టకండ్రిగ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజయవాడ వాసులు ఆరుగురు మృత్యువాత పడటం విదితమే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. తమ అమ్మానాన్న మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని రేవంత్ విషణ్ణవదనంతో చెప్పాడు. తన తమ్ముడు భరత్ ఎవరు లేని అనాథగా మిగిలాడని ఆవేదన చెందాడు. తిరుమలకు శుక్రవారం బయలుదేరిన తన తండ్రి రమేష్, తల్లి రాజ్యలక్ష్మి, పెద్దమ్మ శ్రీలతకు ఫోన్ చేయగా సాయంత్రానికి ఇంటికి వస్తామని చెప్పారని అయితే వారంతా రోడ్డు ప్రమాదంతో తిరిగిరాని లోకాలకు చేరుకోవడం తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చిందని చెప్పారు.



మృతుల బంధువు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తిరుమల దర్శనానికి వెళ్తూ ఫోన్ చేశారు..

మేము తిరుమలకు చేరుకున్నాం.. దర్శనానికి వెళ్తున్నాం.. నువ్వు కూడా వచ్చి ఉంటే బావుండేది..అని తన సోదరుడు రమేష్ ఫోన్ చేసి చెప్పాడని, అయితే ప్రమాదంలో కుటుంబం మొత్తం చనిపోయినట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందడంతో హుటాహుటిన బయల్దేరి ఇక్కడికి వచ్చినట్లు జయరామ్ చెప్పారు. అవనిగడ్డ ప్రాంతం తమదని, తన అన్న రమేష్ విజయవాడలో స్థిరపడి కొడుకులను చదివించారని, భరత్ తల్లిదండ్రులను కోల్పోయినట్లు తెలియనివ్వలేదని, మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన నరసింహమూర్తి, రమణి, అక్షయ మృతదేహాలను గుడివాడకు తీసుకెళుతున్నామని అక్షయ మేనమామ శ్రీకాంత్ తెలిపారు.

మృతదేహాల తరలింపు

శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాద ఘటనాస్థలాన్ని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రమాదం ఆరుగురు మరణించడం బాధాకరమన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలకు చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ప్రభుత్వ ఖర్చులతో మృతదేహాలను వారి సొంత ఊర్లకు పంపుతున్నట్లు ఆర్డీవోరావు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, రేణిగుంట డీఎస్పీ భవ్య కిసోర్, సీఐ అంజుయాదవ్, కమిషనర్ బాలాజీనాయక్, తహసీల్దారు ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.